క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం కబేళా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని ఈఈ బీవీ సుధాకర్ పేర్కొన్నారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు లలితా నగర్, నూరి మసీదు రోడ్డు, రైతు బజారు రోడ్డు, రేపాకు వారి వీధి, టెలిఫోన్ కాలనీ, పోలీసు కాలనీ, నేతాజీ స్కూల్ రోడ్డు పరిసరాల్లో సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖతో సహకరించాలని కోరారు. భవానీపురం పరిధిలోని ఐరన్ యార్డ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో కరెంటు ఆఫీసు ఎదురు, పాత యంఐజీ బ్లాకులు, ఎల్ఐజీ బ్లాకులు, ఐరన్ యార్డు, రిలయర్స్ సమీపంలోని పటమట వారి వీధులలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామన్నారు. చిట్టినగర్ పరిధిలోని కొత్త అమ్మవారి ఫీడర్ పరిధిలోని కళ్యాణ మండపం, సాధు జాన్ వీధి, రాయప్ప రాజు వీధి, ఈద్గామహాల్ కొండ ప్రాంతం, వలీ వీధి, కేఎల్‌రావు పార్కు, కోస్టల్ స్కూల్, సీఎం ఆరోగ్య కేంద్రం ప్రాంతాల్లో సరఫరాను ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

29న ఎస్ఆర్ఆర్‌లో అంతర్జాతీయ వెబినార్



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వెబినార్‌లు దోహదపడతాయని కళాశాల రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ అన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 29వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ వెబినార్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. డాక్టర్ కృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని కళాశాల ప్రిన్సిపాల్ కె భాగ్యలక్ష్మితో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఈ నెల 29న కళాశాలలో ఎక్స్‌ప్లోరింగ్ రీసెర్చ్ ట్రెండ్స్ ఇన్ కెమిస్ట్రీ అండ్ బయో కెమిస్ట్రీ అంశంపై అంతర్జాతీయ వెబినార్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

26న సంగీత విద్వాంసుడు దక్షిణామూర్తికి గురు సత్కారం

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద ఆధ్వర్యంలో 26 వ తేదీ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు పాణ్యం దక్షిణామూర్తికి గురు సత్కార కార్యక్రమం నిర్వహిస్తునట్లు సంస్థ వ్యవస్థాపకులు జంగం చక్రవర్తి, జంగం విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాలకు చెందిన గోళ్ళ నారాయణ రావు, డాక్టర్ గుమ్మా సాంబశివరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు పాల్గొంటారని పేర్కొన్నారు. నాట్యవేద విద్యార్థులచే అన్నమయ్య సంకీర్తనా ప్రవంతి కార్యక్రమం జరుగుతుందన్నారు.

ఆది దంపతుల ఆర్జిత సేవలకు డిమాండ్



సహస్ర లింగార్చన అనంతరం విశేష అలంకరణ



ఆది దంపతులకు శాంతి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



చండీ హోమంలో పాల్గొన్న ఉభయదాతలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసం, శుక్రవారం నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. తెల్లవారుజామున ప్రథమంగా జరిగే వస్త్రాలంకరణ సేవ, ఖడ్గమాలార్చనతో పాటు ఉదయం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, చండీ హోమం, శాంతి కల్యాణంలో ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర లింగార్చన, మల్లేశ్వర స్వామి వారికి త్రికాల అర్చనలు, పంచామృత అభిషేకాలు పెద్ద ఎత్తున నిర్వహించగా, భక్తులు తమ నామ గోత్రాలతో పూజలు జరిపించుకున్నారు. అమ్మవారి పంచహారతుల సేవ , ఆది దంపతుల ఊంజల్ సేవ, దీపారాధన సేవలో భక్తులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన క్యూలైన్లు....

అమ్మవారిని దర్శించుకునేందుకు నవ దంపతులతో పాటు ఉభయదాతలు, భక్తులు ఇంద్రకీలాద్రికి తరలిరావడంతో క్యూలైన్లు కిటకిటలాడాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకు భక్తుల తాకిడి కనిపించింది. మధ్యాహ్నం అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు 11–40 గంటల నుంచి 12–15 గంటల వరకు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో కెఎస్.రామారావు క్యూలైన్లను పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం రూ. 500 టికెట్ క్యూలైన్‌లో తనిఖీలు నిర్వహించారు. అమ్మవారి అంతరాలయం దర్శనం చేసుకునే ప్రతి ఒక్కరూ తప్పని సరిగా టికెట్లు కొనుగోలు చేసేలా చూడాలని ఏఈవో చంద్రశేఖర్‌తో పాటు దేవస్థాన ఇన్‌స్పెక్టర్, క్యూలైన్ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.



క్యూలైన్లను పర్యవేక్షిస్తున్న ఈవో రామారావు

ఘనంగా పోతులూరి జయంతి



బ్రహ్మంగారి జీవిత చరిత్ర పటాలు ఆవిష్కరిస్తున్న శ్రీకాంత్ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కాలజ్ఞానం ద్వారా ప్రజలను చైతన్య పరిచిన మహనీయులు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి అని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 415 జయంతి గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తోలేటి శ్రీకాంత్ హాజరయ్యారు. తొలుత పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కాలజ్ఞానం ద్వారా ప్రపంచానికి భవిష్యత్తును తెలిపిన మహనీయులని కొనియాడారు. మూఢ నమ్మకాలపై చైతన్య పరిచి కాల జ్ఞాన తత్వాలను ప్రచారం చేసి కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతాల భేదాలు లేకుండా మానవులందరూ సమానమనే సత్యాన్ని చూపించారని పేర్కొన్నారు. అనంతరం బ్రహ్మంగారి జీవిత చరిత్ర చిత్రపటాలను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర విశ్వబ్రహ్మణ సేవా సంఘం కార్యదర్శి కె. అచారి, మహిళా సంఘం అధ్యక్షురాలు కల్లూరి శ్రీవాణి, బీసీ నాయకులు ఎస్‌పీ. శేషగిరి, యువజన నాయకులు జవ్వాది సుధీర్, మంగరాజు, జేజిబాబు, పెదప్రోలు బ్రహ్మం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తులసీ కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో తులసీ కల్యాణం శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. పాతబస్తీలోని పురాతన ఆలయమైన వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని తులసీ అమ్మవారికి శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి కల్యాణోత్సవం నిర్వహించారు. కార్తికమాసం, శుక్రవారం, క్షీరాబ్ధి ద్వాదశిని పురస్కరించుకొని ఆలయంలో కొలువై ఉన్న పద్మావతి అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించారు. తులసీ కల్యాణాన్ని పురస్కరించుకొని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అర్చకస్వాములు పొన్నంగిపల్లి శ్రీరామచంద్రమూర్తి అర్చక కార్యక్రమాలు నిర్వహించారు.



స్వామి వారి కల్యాణం

ఈక్విటీ మార్కెట్‌పై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న సాంబశివరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు ఈక్విటీ మార్కెట్‌పై అవగాహన పెంచుకోవాలని ఎంసీఎక్స్ సంస్థ ఏపీ, తెలంగాణ బిజినెస్ హెడ్ ఎం. సాంబశివరావు అన్నారు. పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఫైనాన్షియల్ మార్కెట్స్ ప్రాధాన్యంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ విద్యార్థులు ఫైనాన్షియల్ మార్కెట్‌ను, దాని ట్రేడింగ్ విధానాన్ని తెలుసుకోవాలని సూచించారు. ఆ రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ట్రేడింగ్ ద్వారా స్వయం ఉపాధిని పొందవచ్చని పేర్కొన్నారు. ఈక్విటీలు, వివిధ అంతర్జాతీయ కరెన్సీలు, డెరివేటివ్‌లతో ఆర్థిక సాధానాలను వర్తకం చేయటానికి మార్గాలు, తదితర అంశాలను వివరించారు. కళాశాల ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.విజయదుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భర్త మృతిపై భార్య ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడి గాయపడిన తన భర్త చికిత్స పొందుతూ మృతి చెందడంపై భార్య కొత్తపేట పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. ఘటనపై అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. వించిపేట లక్ష్మయ్య వీధికి చెందిన అన్వర్ ఖాన్, పఠాన్ అంటున ఖాలిక్ భార్యాభర్తలు. అన్వర్ ఖాన్‌కు గత కొంత కాలంగా అనారోగ్యంగా ఉండటంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం అన్వర్ ఖాన్ ఆసుపత్రికి వెళ్లే తరుణంలో బండిపై ఎక్కుతూ ప్రమాదశాత్తు కింద పడ్డాడు. దీంతో తలకు గాయమైంది. అయితే యథావిధిగా ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చిన అన్వర్‌ఖాన్ తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని కుటుంబ సభ్యులకు చెప్పడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఘటనపై భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): హెయిర్ కలర్ నీళ్లలో కలుపుకుని తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాత రాజరాజేశ్వరిపేట మణికంఠ మెడికల్ షాపు ప్రాంతానికి చెందిన షేక్. సల్మా, రసూల్ భార్యాభర్తలు. వీరికి 6 ఏళ్ల కిందట వివాహం కాగా ఒక కుమార్తె ఉంది. కొంత కాలంగా రసూల్ తల్లి నూరున్నీసా కోడలిని వేధింపులకు గురిచేయసాగింది. దీనికి తోడు భర్త వేధింపులు కూడా ప్రారంభమయ్యాయి. గురువారం సల్మా, రసూల్‌లది పెళ్లిరోజు కావడంతో బయటకు వెళ్లాలని భావించారు. అయితే అత్త కారణంగా వెళ్లలేదు. దీంతో మనస్తాపానికి గురైన సల్మా శుక్రవారం ఉదయం తలకు వేసుకునే రంగును నీళ్లలో కలుపుకుని తాగింది. దీంతో విషయం గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డయల్ యువర్ పోలీస్ కమిషనర్‌కు 12 ఫిర్యాదులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ప్రజా సమస్యల సత్వర పరిష్కార వేదికగా పోలీస్ కమిషనరేట్‌లో శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ పోలీస్ కమిషనర్ కార్యక్రమంలో బాధితులు నేరుగా తమ సమస్యలను సీపీకి తెలియజేశారు. ఇందుకోసం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో కేటాయించిన 0866–2490613 నంబర్‌కు 12 మంది బాధితులు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపారు. వీటిలో ట్రాఫిక్ సమస్యలు, అసాంఘిక శక్తులు, కుటుంబ కలహాలు, ఆర్థిక నేరాలు, స్థలం తగాదాల గురించి ఉన్నాయి. సంబంధిత పోలీస్ స్టేషన్ యస్‌హెచ్‌ఓలు, ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి ఆయా సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించే దిశగా సీపీ ఆదేశాలు జారి చేశారు.



డయల్ యువర్ సీపీలో బాధితులతో ఫోన్‌లో మాట్లాడుతున్న సీపీ టీకే రాణా

కార్తిక మాసం శాస్త్రీయ అంశాల సమాహారం

విజయవాడ కల్చరల్: కార్తిక మాసం శాస్త్రీయమైన అంశాలకు నిలయమని తెలుగు సంస్కృత అకాడమీ సభ్యుడు డాక్టర్ కప్పగంతు రామకృష్ణ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో గుణదలలోని రోటరీ కార్యాలయంలో శుక్రవారం కార్తిక విజ్ఞాన అంశంగా ప్రసంగం నిర్వహించారు. డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ భారతీయ ఆధ్యాత్మిక రంగంలో కార్తిక మాసానికి విశిష్టమైన స్థానం ఉందన్నారు. భక్తి భావంతోపాటు శాస్త్రీయత నిండి ఉంటుందని తెలిపారు. ప్రకృతికి అనుగుణంగా మానవుడు తన జీవన విధానాన్ని మార్చుకోవాలని సూచన చేసే వ్యవస్థ మన భారతీయులదన్నారు. అందులో భాగమే చేసేటువంటి స్నానాలుగా అభివర్ణించారు. దీపారాధన, దానాలు ఈకోవకే చెందుతాయన్నారు. నగర రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ సుబ్బారావు రావూరి, కార్యదర్శి ఆర్ఎస్‌వీ రామారావు, నగర గవర్నర్ డాక్టర్ రవికుమార్ కంచర్ల పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ కప్పగంతు రామకృష్ణను సత్కరించారు.



కార్తీక విజ్ఞానం అంశంగా మాట్లాడుతున్న డాక్టర్ కప్పగంతు రామకృష్ణ

డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందికి జరిమానా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): మద్యం తాగి వాహనాలు నడిపిన 20 మందికి జరిమానా విధిస్తూ ఆరవ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్ట్ న్యాయమూర్తి జి. లెనిన్‌బాబు శుక్రవారం తీర్పు వెల్లడించారు. నగరంలో రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ టీకే రాణా ఆదేశాల మేరకు 5వ ట్రాఫిక్ పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. వీరిలో ఏడుగురు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ.15 వేలు, మిగిలిన 13 మందికి ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున న్యాయమూర్తి జరిమానా విధించారు.

ఫార్చ్యూన్ మురళీ పార్క్‌లో ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరు చేపల పులుసు, రాయలసీమ నాటుకోడి కూర, రాగి సంకటి, రొయ్యలకూర, బొంగు చికెన్, గోంగూర మటన్, పీతల ఇగురు వంటి వంటకాలతో మహాత్మాగాంధీరోడ్డులోని హోటల్ ఫార్చ్యూన్ మురళీపార్క్‌లో ఆంధ్రా ఫుడ్ ఫెస్టివల్ శుక్రవారం ప్రారంభమైంది. డిసెంబరు 3 వరకూ కొనసాగే ఈ ఫుడ్ ఫెస్టివల్ ప్రతిరోజూ బఫెట్ డిన్నర్ , ఆదివారం బఫెట్ లంచ్ అండ్ డిన్నర్ ఉంటుంది. ఒక్కరికి రూ.1000తో పాటు (జీఎస్టీ అదనం) ఉంటుంది. ఈ ఫెస్టివల్‌లో నోరూరించే కాకినాడ కాజ, సున్ని ఉండలు, అరిసెలు, పూతరేకులు, నేతి బొబ్బట్లు, చక్రపొంగలి వంటి వాటితో పాటు, అనేక రకాల వెజ్ కూరలు శాకాహార ప్రియుల కోసం కొలువు తీరాయి. ఇలా వెజ్ అండ్ నాన్ వెజ్ వంటకాలతో ఫెస్టివల్ ఏర్పాటు చేసినట్లు హోటల్ మేనేజర్ పవన్ తెలిపారు.



ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో ఆంధ్ర వంటకాల వద్ద చెఫ్

భారత రాజ్యాంగం అత్యున్నతమైనది

పటమట(విజయవాడతూర్పు): భారత రాజ్యాంగం అత్యుత్తమమైనదని మద్రాస్ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ రిటైర్డ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కోటేశ్వరప్రసాద్ అన్నారు. నగరంలోని స్టెల్లా కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ రాజ్యాంగం రూపకల్పన దినోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ యువతకు ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగం పట్ల అవగాహన కలి ఉండటం చాలా అవసరమని తెలిపారు. రాజ్యాంగం భారత పౌరులకు పాలించే అధికారం కల్పించిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క పౌరునికి భావ ప్రకటన, ఆలోచన, విశ్వాసం, మతం, ఆరాధన, స్వేచ్ఛను రాజ్యాంగం కల్పించిందన్నారు. అనంతరం ఆయన్ను కళాశాల యాజమాన్యం సత్కరించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రేఖ, కళాశాల సుపీరియర్ సహాయ మేరీ, డిగ్రీ వైస్ ప్రిన్సిపల్ ఉషా కుమారి, ఇంటర్ వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణ, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి ప్రసాద రావు, అధ్యాపకులు మృదులశ్రీ, శరత్ చంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.



సమావేశంలో కోటేశ్వరప్రసాద్‌ను సన్మానిస్తున్న స్టెల్లా యాజమాన్యం